ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
బుధవారం 20 మార్చి 2024



27 నుంచి
శివకల్యాణోత్సవాలు 7
- 28న రాజరాజేశ్వరస్వామి కల్యాణం

పంట నష్టాన్ని పరిశీలించిన అధికారులు, నాయకులు 8

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:26 బుధవారం
సహర్ 4:51 గురువారం



వడగళ్ల వర్షం.. అన్నదాతకు కష్టం

- మూడు రోజులుగా దెబ్బతింటున్న పంటలు
- నేలవాలుతున్న వరి, రాలుతున్న మామిడి
- ఎండుతున్న పంటలకు తోడుగా అకాల నష్టం
- జిల్లాలో 2.7 మిల్లీమీటర్ల వర్షం

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

యాసంగి దిగుబడిపై అన్నదాతలు ఆందోళన చెం దుతున్నారు. ఓ వైపు సాగునీరందక పంటలు ఎండు తుండగా మరోవైపు వడగళ్ల వర్షంతో నష్టం వాటిల్లుతోంది. వరుసగా మూడు రోజుల నుంచి అకాల వర్షానికి వరి పంట నేలవాలుతోంది. సోమవారం రాత్రి జిల్లాలో కురిసి వడగళ్ల వర్షం రైతులను అతలాకుతలం చేసింది. మంగళవారం కూడా మబ్బులు కమ్మి వర్షం పడడంతో ఎలాంటి నష్టం వాటిల్లుతుందోనని రైతులు భయపడ్డారు. మరో రెండు రోజులు వడగళ్ల వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తుండడంతో రైతులు దిగులు చెందుతున్నారు. ఇప్పటికే జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటి పో వడంతో అన్నదాతలకు యాసంగిపై ఆశలు ఆవిరవుతున్నాయి. ఇదే సమయంలో భారీ వడగళ్ల వర్షం నష్టాన్ని మిగులుస్తోంది. మంగళవారం 8 గంటల వరకు జిల్లాలో సరాసరి 2.7 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదైంది. రుద్రంగిలో 4.0 మిల్లీమీటర్లు, చందుర్తి 2.9, వేములవాడ రూరల్ 0.5, బోయినపల్లి 1.2, సిరిసిల్ల 8.5, కోనరావుపేట 0.5, ఎల్లారెడ్డిపేట 0.5, తంగళ్లపల్లి 2.9, ఇల్లంతకుంట 1.2, ముస్తాబాద్‌లో 11 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ముస్తాబాద్‌లో గాలి దుమారానికి చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడి రైతు ఎలుసాని ఎల్లయ్య మృతి చెందాడు. తంగళ్లపల్లి, ముస్తాబాద్, సిరిసిల్ల ప్రాంతాల్లో వడగళ్ల వర్షాలకు భారీగా పంట నష్టం వాటిల్లింది. వరి పంట నేలవాలగా తంగళ్లపల్లిలో మామిడి పంటలు భారీగా దెబ్బతిన్నాయి. మంగళవారం ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌తోపాటు బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. రైతులను పరామర్శించారు. వ్యవసాయ అధికారులు నష్టపోయిన పంటలను అంచనా వేశారు.

● యాసంగి దిగుబడిపై దిగాలు

జిల్లాలో భూగర్భ జలాలు వేగంగా పడిపోవడంతో పాటు ప్రాజెక్టులు చెరువుల్లో నీటి మట్టాలు తగ్గిపోవడం, బోరు బావుల నుంచి సాగునీరు అందని పరిస్థితుల్లో వరి పొలాలు నెర్రలు బారి రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. జిల్లాలో కొందరు రైతులు పశువులకు మేతగా వదిలేశారు. ఎండిన పొలాలకు నిప్పు పెట్టి ఆవేదన వెలిబుచ్చారు. జిల్లాలో గతేడాది ఫిబ్రవరిలో 7.94 మీటర్ల లోతులో నీళ్లు లభిస్తే ప్రస్తుతం సరాసరి 10.18 మీటర్ల లోతులోకి భూగర్భ జలాలు పడిపోయాయి. మిడ్ మానేరు ప్రాజెక్టులో 27.50 టీఎంసీల సామర్థ్యానికి 10 టీఎంసీలకు నీటి మట్టం పడిపోయింది. అన్నపూర్ణ ప్రాజెక్టులో డెడ్ స్టోరేజీకి చేరుకుంది. మళ్లీ రైతులు బోరుబావులను పూడికలు తీస్తూ సాగునీరు కోసం తండ్లాడుతున్నారు. ఇదే సమయంలో వడగళ్ల వర్షానికి మరింత పంట నష్టం వాటిల్లుతోంది.

జిల్లాలో 1.76 లక్షల ఎకరాల్లో యాసంగి సాగు

జిల్లాలో యాసంగి సీజన్‌లో 1.76 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఇందులో ప్రధానంగా వరి 1.73 లక్షల ఎకరాల్లో వేసుకున్నారు. ఇల్లంతకుంట, చందుర్తి, తంగళ్లపల్లి, వీర్నపల్లి, ముస్తాబాద్, రుద్రంగి, కోనరావుపేట, మండలాల్లో వరి పంట భూగర్భ జలాలు అడుగంటి ఎండిపోతున్నాయి. ఇదే క్రమంలో అకాల వర్షం మరింత నష్టాన్ని మిగిల్చింది. యాసంగిలో వివిధ పంటల్లో గంభీరావుపేట 17,324 ఎకరాలు, ఇల్లంతకుంట 26,748, ముస్తాబాద్ 19,953, సిరిసిల్ల 4783, తంగళ్లపల్లి 18,914, వీర్నపల్లి 6214, ఎల్లారెడ్డిపేట 16,540, బోయినపల్లి 13,424, చందుర్తి 15,216, కోనరావుపేట 17,180, రుద్రంగి 5195, వేములవాడ 5195, వేములవాడ రూరల్ 10,522 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు.



పెద్దూర్‌లో కూలిన చెట్టు

ప్రశాంతంగా కొనసాగుతున్న పదోతరగతి పరీక్షలు



తంగళ్లపల్లిలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

సిరిసిల్ల రూరల్, మార్చి 19 : జిల్లాలో పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రంలోని గీతానగర్ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని అదనపు కలెక్టర్ పూజారి గౌతమి మంగళవారం తనిఖీ చేశారు. జిల్లాలో 35 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా మంగళవారం జరిగిన పరీక్షకు 6473 మంది విద్యార్థులకు 6467 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆరుగురు గైర్హాజరయ్యారు. డీఈవో రమేష్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండల కేంద్రంలోని పదోతరగతి పరీక్ష కేంద్రాన్ని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ తనిఖీ చేశారు. మంగళవారం తంగళ్లపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో పరీక్షలు కొనసాగుతున్న తీరును పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించవద్దని సూచించారు. డీఈవో రమేశ్, తహసీల్దార్ వెంకటలక్ష్మి ఉన్నారు.

రామమందిరం గుర్తుగా వెండి నాణెం



నాణెంపై రాముడు, రామమందిరం

సిరిసిల్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో రామ మందిరం నిర్మాణానికి గుర్తుగా భారత ప్రభుత్వం కలకత్తా నాణేల తయారీ కేంద్రం నుంచి వెండి నాణెన్ని విడుదల చేసింది. సిరిసిల్లకు చెందిన నాణేల సేకరణకర్త బుడిమె ప్రకాష్ మంగళవారం రామమందిరం నాణేన్ని అందుకున్నారు. 50 గ్రాముల బరువుతో తయారు చేసిన వెండి రామ్‌లల్లా నాణానికి ఒక వైపు రామ మందిరంలో ప్రతిష్ఠించిన రాముడి చిహ్నం, మరోవైపు రామ మందిరం చిత్రాన్ని చిత్రీకరించారు. ఎంతో ఆకర్షణీయంగా ఉన్న ఈ నాణెం ఖరీదు, జీఎస్టీతో కలిపి రూ.5092 ధరకు కొనుగోలు చేశారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

ఎల్లారెడ్డిపేట, మార్చి 19: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి శివారులోని దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం పురోహితులు రాచర్ల రఘురామ శర్మ ఆధ్వర్యంలోని అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, కళాన్యాసం, పూర్ణాహుతి, కుంబాభిషేకం తదితర పూజలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో దుర్గాదేవి మందిర కమిటీ, అంబేద్కర్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవాలు



అమ్మవారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట, మార్చి 19 : కోనరావుపేట మండలం వట్టిమల్లలో రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, నందు గౌడ్, మానుక సత్యం, గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేటలో తాగునీటి కటకట



కాలనీలోని వాటర్ ట్యాంక్

గంభీరావుపేట, మార్చి 19: గంభీరావుపేట మండల కేంద్రంలోని ఎల్లమ్మ కాలనీలో తాగునీటి కటకటతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో ప్రధాన ఆధారమైన మినీ వాటర్ ట్యాంక్ బోరు పని చేయక పది రోజులు అవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ప్రత్యేక అధికారుల పాలన కావడంతో తమ ఇబ్బందిని ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదని వాపోయారు. మిషనభగీరథ నీరు కూడా సరిగా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకోవాలని, సమస్యను పరిష్కరించాలని కోరారు.

తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి




సమావేశంలో మాట్లడుతున్న ఎంపీపీ పడిగెల మానస

తంగళ్లపల్లి, మార్చి 19: తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఎంపీపీ పడిగెల మానస రాజు అన్నారు. తంగళ్లపల్లి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ పడిగెల మానస అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. అంకుసాపూర్ శివారులో నూతనంగా నిర్మించిన వంతెన వద్ద విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయని, వాటిని సరిచేయాలని ఎంపీటీసీ కర్కబోయిన కుంటయ్య అన్నారు. గొర్రెల కోసం చాలామంది డబ్బులు చెల్లించారని ఇప్పటి వరకు పంపిణీ చేయలేదని ఎంపీటీసీ రాగుల రాజిరెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశానికి గైర్హాజరవుతున్న పలు శాఖల అధికారులపై చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. మిషన్ భగీరథ నీటి సరఫరా, ఆర్టీసీ, టీ ఫైబర్‌పై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎంపీటీసీ భైరినేని రాము, పలువురు ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీవో జోగం రాజు కల్ల జేసుకోవడం శాంతించారు. రేషన్ కార్డుల అంశంపై ప్రశ్నించగా త్వరలోనే జారీ చేయనున్నట్లు తహసీల్దార్ వెంకటలక్ష్మి వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ పడిగెల మానస మాట్లడుతూ దశల వారీగా మండలాన్ని అభివృద్ధి చేశామన్నారు. అకాల వర్షంతో నష్ట పోయిన పంటల వివరాలను త్వరితగతిన నమోదు చేసి రైతులకు పరిహారం అందేలా సంబంధిత అధికారులు చూడాలన్నారు. సమావేశంలో ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం





బండపల్లి గ్రామంలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం, స్వామివారి మూలవిరాట్

చందుర్తి, మార్చి19: మండలంలోని బండపల్లి గ్రామంలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. బుధవారం నుంచి ఈ నెల 25 వరకు ఆలయంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 23న ఉదయం 11 గంటల 45 నిమిషాలకు స్వామివారి కల్యాణం చేపట్టనున్నారు. 25న రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు శ్రీకాంతచార్యులు, దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. కల్యాణోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

జిల్లాలో ఆరు చెక్‌పోస్టుల ఏర్పాటు

- మద్యం, డబ్బు అక్రమ రవాణాపై నిఘా
- ఎస్పీ అఖిల్ మహాజన్



జిల్లెల్లలో చెక్ పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్పీ

సిరిసిల్ల క్రైం, మార్చి 19: లోక్ సభ ఎన్నికల దృష్ట్యా జిల్లా సరిహద్దుల్లో ఆరు చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మంగళవారం జిల్లాలోని తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికల సందర్భంగా గంభీరావుపేట మండలంలోని పెద్దమ్మ స్టేజి వద్ద చెక్‌పోస్టు, ముస్తాబాద్ మండల పరిధిలోని వెంకట్రావుపల్లి చెక్‌పోస్టు, వేములవాడ రూరల్ మండలంలోని ఫాజుల్‌నగర్ చెక్‌పోస్టు, బోయినపల్లి మండలంలోని కొదురుపాక చెక్‌పోస్టు, రుద్రంగి మండలంలోని మానాల క్రాస్‌రోడ్డు చెక్‌పోస్టు ఏర్పాటు చేశామన్నారు. ప్రతీ చెక్‌పోస్టు వద్ద నిరంతరం తనిఖీలు నిర్వహిస్తారన్నారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం, డబ్బు అక్రమంగా సరఫరా కాకుండా నిఘా ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోకి వచ్చే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి మద్యం, డబ్బు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతీఒక్కరు నిబంధనలు పాటించాలన్నారు. వాహనాల తనిఖీల్లో రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్తే సీజ్ చేస్తామన్నారు. అత్యవసర వైద్యం, కళాశాలల ఫీజులు, వ్యాపారం, పెళ్లిళ్లు, ఇతర అవసరాలకు డబ్బులను తీసుకెళ్తున్న వారు సరైన పత్రాలు చూపించాలన్నారు. నగదుకు సంబంధించిన తగిన ఆధారాలు, ధృవపత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. ఎన్నికల నియామవాళిని అందరూ పాటిస్తూ వాహనాల తనిఖీలకు ప్రజలు సహకరించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై నిఘా తీవ్రతరం చేశామన్నారు. చెక్ పోస్టుల వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఎస్పీ పలు సూచనలు చేశారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

రుద్రంగి: జిల్లా సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహించే అధికారులు అప్రమత్తంగా ఉండాలని వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా రుద్రంగి మండల కేంద్రం శివారులో సిరిసిల్ల, జగిత్యాల సరిహద్దు వద్ద చెక్ పోస్టు ఏర్పాటు చేయగా మంగళవారం తనిఖీ చేశారు. ఎస్సై సిరిసిల్ల అశోక్, తదితరులు ఉన్నారు.



వాహనాన్ని తనిఖీ చేస్తున్న డీఎస్పీ నాగేంద్రచారి

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు పాటించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు కమిషన్ మార్గదర్శకాలను పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై సెక్టార్ అధికారులు, పోలీస్ అధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఎన్నికలను కొత్తగా పరిగణించాలని, కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు. జిల్లాలోని 547 పోలింగ్ కేంద్రాలు, 57 సెక్టార్‌ల పరిధిలోకి వస్తాయని, పోలింగ్ కేంద్రాల్లో సజావుగా పోలింగ్ జరిగేలా సెక్టార్ అధికారులు బాధ్యత వహించాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల రూట్‌లను ముందుగానే పోలీస్ అధికారులతో కలిసి పరిశీలించాలన్నారు. పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడంలో సెక్టార్ అధికారులు కీలక పాత్ర పోషిస్తారన్నారు. అర్హుల పేర్లు ఓటరు జాబితాలో నమోదు చేయడం నుంచి క్రిటికల్ పోలింగ్ కేంద్రాల గుర్తింపు, మాక్ పోల్ నిర్వహణ, పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన వసతుల కల్పన, రిజర్వ్ ఈవీఎం యంత్రాల నిర్వహణ, పోలింగ్ సమయంలో ఈవీఎంలు మొరాయిస్తే యంత్రాలను మార్చడం వంటి బాధ్యతలు ఉంటాయన్నారు. ప్రీపోల్, పోల్‌డే, పోస్ట్ పోల్‌డే విధులపై అవగాహన ఉండాలన్నారు. రాబోయే వేసవి కాలం దృష్ట్యా పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన అన్నీ రకాల వసతులు కల్పించాలన్నారు. ఈవీఎం యంత్రాలను ప్రభుత్వ వాహనాల్లోనే తరలించాలని, రిజర్వ్ యంత్రాలపై స్టిక్కర్లు ఉండాలని అన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించే సమయంలో నిబంధనలు పాటించాలన్నారు. తనిఖీల సమయంలో ప్రజలతో మర్యాదగా ప్రవర్తించాలని, విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని అన్నారు. గతంలో ఎన్నికల సమయంలో గుర్తించిన ఇబ్బందులపైనా, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపైనా నివేదిక ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్, సిరిసిల్ల వేములవాడ ఆర్డీవోలు రమేష్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన అధికారులు

ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు



ప్రైవేటు పాఠశాలల సిబ్బందితో మాట్లాడుతున్న అధికారులు

ముస్తాబాద్, మార్చి 19 : ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల వద్ద అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తప్పవని మండల విద్యాధికారి బన్నాజీ హెచ్చరించారు. ముస్తాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ప్రైవేటు పాఠశాలల యజమాన్యాలతో ఎంపీడీవో భాస్కరశర్మ, ఎంఈవో బన్నాజీ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. అన్ని పాఠశాలల్లో గవర్నింగ్ బాడీ పేరేంట్స్ కమిటీ ఆమోదం మేరకు ఫీజులు వసూలు చేయాలన్నారు. పరీక్షల నిర్వహణ సమయంలో ఫీజుల కోసం ఒత్తిడి చేయొద్దని, ప్రతీ పాఠశాలలో నోటీసు బోర్డుపై ఫీజుల వివరాలు ప్రదర్శించాలని ఆదేశించారు. ప్రతీ పాఠశాల నిబంధనలకు అనుగుణంగా నడిపించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలల సిబ్బంది మోహన్, స్రవంతి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కండక్టర్‌పై దాడి.. పోలీసులకు అప్పగింత

కోరుట్ల, మార్చి 19: మద్యం మత్తులో ఆర్టీసీ బస్సులోని మహిళా కండక్టర్‌పై ఓ ప్రయాణికుడు దాడికి పాల్పడిన సంఘటన మంగళవారం కోరుట్లలో జరిగింది. వేములవాడ డిపోకు చెందిన బస్సు కోరుట్ల బస్‌స్టాండ్ నుంచి వేములవాడకు వెలుతుంది. మద్యం మత్తులో ఓ వ్యక్తి ప్రయాణికుల తో పాటు బస్సు ఎక్కాడు. పట్టణంలోని నంది చౌరస్తా ప్రాంతానికి చెరుకోగా మద్యం తాగి ఉన్న వ్యక్తి బస్సు కండక్టర్ టికెట్ విషయంపై ప్రశ్నించగా సదరు వ్యక్తి కండక్టర్‌పై దురుసుగా ప్రవర్తించి దాడికి యత్నించాడు. దీంతో డ్రైవర్ అప్రమత్తమై పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ప్రాంతానికి బస్సును తీసుక పోయి అతనిని పోలీసులకు అప్పగించారు.

దాడి ఘటనలో ఒకరిపై కేసు

ఎల్లారెడ్డిపేట, మార్చి 19: మహిళపై దాడి చేసిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన దీటి తిరుపతిపై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ మంగళవారం తెలిపారు. గ్రామంలోని దీటి లక్ష్మికి ఆమె బావ శ్రీనివాస్‌తో కొంతకాలంగా ఇంటి పంపకం విషయంలో గొడవలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ క్రమంలో శ్రీనివాస్ కొడుకు తిరుపతి ఈ నెల 18న రాత్రి లక్ష్మి ఇంటికి చేరుకొని గొడవకు దిగాడని చెప్పారు. అంతటితో ఆగని అతడు లక్ష్మిని అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడికి పాల్పడ్డాడని పేర్కొన్నారు. ఇంటి సమీపంలో ఉన్న పశుగ్రాసాన్ని దహనం చేశాడని తెలిపారు. బాధితురాలు లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై రమాకాంత్ వివరించారు.

జనశక్తి నక్సలైట్ పేరుతో మోసం చేస్తున్న వ్యక్తి అరెస్ట్

కోనరావుపేట, మార్చి 19: జనశక్తి నక్సలైట్ పేరుతో ప్రజలను భయపెడుతూ డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. బోయినపల్లి మండలం కొదురుపాక గ్రామానికి చెందిన చెన్నమనేని పురుషోత్తమరావు ప్రభుత్వ నిషేధిత విప్లవ సంస్థ జనశక్తి అరుణోదయ సంస్థలోపనిచేస్తున్నానని అమాయక ప్రజలను బెదిరిస్తూ పార్టీ ఫండ్ పేరిట ప్రజల వద్ద అధిక మొత్తంలో డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నాడని పురుషోత్తమరావును కోనరావుపేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కుతరలించినట్లు తెలిపారు. జనశక్తి నక్సలైట్ల పేరుతో ప్రజలను ఇబ్బందులు పెట్టే వారి సమాచారం పోలీసులకు అందించాలని అన్నారు.

వడదెబ్బ తగలకుండా ఉపాధి కూలీలు అప్రమత్తంగా ఉండాలి



కూలీలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

వెల్గటూర్, మార్చి 19: వేసవికాలంలో వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి శ్రావణ్ కుమార్ సూచించారు. మంగళవారం వెల్గటూర్, కోటిలింగాల గ్రామాలలో ఉపాధిహామీ కూలీలకు ఓఆర్ఎస్ పాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో వడదెబ్బకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ముందు జాగ్రత్తగా ఉపాధిహామీ కూలీలకు ఓఆర్ఎస్ ద్రావణం ప్రాముఖ్యతను వివరించి పాకెట్లు అందజేసినట్లు తెలిపారు. ఎల్‌సీడీసీ సర్వేలో భాగంగా కుష్టు వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు. శరీరంపై ఏర్పడే స్పర్శ లేని మచ్చలను అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో జగన్నాథం, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గోడకూలి బాలుడి మృతి

మేడిపల్లి, మార్చి 19: సిమెంట్ గోడకూలి బాలుడు మృతిచెందిన సంఘటన మంగళవారం మధ్యాహ్నం మేడిపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మేడిపల్లి ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లి శివారులో నిర్మిస్తున్న పౌల్ట్రీఫాంలో మహబూబాబాద్ జిల్లా వొడ్డెర గూడెం గ్రామానికి చెందిన సంపంగి సంగీత, శ్రీను దంపతులు తమ కొడుకు గణేష్(4)ను తీసుకొని కూలీపనులు చేయడానికి వచ్చారు. ఈ క్రమంలో అదే ఫాంలో పనిచేస్తున్న పెద్దపల్లి జిల్లాలోని ధర్మారం మండలం దొంగ తుర్తికి చెందిన అమరగోని రాజు కాంక్రీట్ మిక్సర్ వాహనాన్ని అజాగ్రత్తగా నడిపి సిమెంట్ గోడను ఢీకొట్టాడు. దీంతో సిమెంట్ గోడ పక్కనే నిద్రిస్తున్న బాలుడిపై గోడ కూలడంతో బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. పొట్టకూటి కోసం వచ్చి తమ కుమారుడిని కోల్పోవడంతో తల్లితండ్రుల రోదనలు మిన్నంటాయి. తల్లి సంపంగి సంగీత ఫిర్యాదు మేరకు డ్రైవర్ అమరగోని రాజుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గోపాల్‌రావుపేటలో బైక్ చోరీ

రామడుగు, మార్చి 19: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన ఇనుగుర్తి రఘువీర్ అనే వ్యక్తి బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఇంటి ముందు పెట్టిన యమహ బైక్‌ను దొంగిలించడంతో బాధితుడు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. గత 15 రోజులుగా వరుస దొంగతనాలు జరుగుతుండడంతో గ్రామస్థులు భయాందోళనకు గురి అవుతున్నారు. బస్టాండ్ వద్ద రాత్రి వేళల్లో షాపుల తాళాలు పగులకొట్టి నగదు, పరికరాలను ఎత్తుకెల్లిన సంఘటనలున్నాయి. సీసీ కెమరాలను ఏర్పాటు చేసి దొంగతనాలను అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కొడిమ్యాల, మార్చి 19: మండలంలోని రామకిష్టాపూర్ గ్రామానికి చెందిన గుడి మల్లారెడ్డి(65)కరీంనగర్ ఆసుపత్రిలో 10 రోజులుగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. వయస్సు పైబడి, కుటుంబ పోషణ భారమై ఈ నెల 8న జీవితంపై విరక్తి చెంది పొలం వద్ద మల్లారెడ్డి పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మల్లారెడ్డి భార్య గుడి రాజవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

27నుంచి వేములవాడలో శివకల్యాణోత్సవాలు

వేములవాడ, మార్చి 19: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర క్షేత్రంలో ఈ నెల 28వ తేదీన శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఐదు రోజులపాటు శ్రీ శివకల్యాణోత్సవాలు జరుపనున్నారు. ఇందులో భాగంగా 28వ తేదీ గురువారం ఉదయం 10.50ని.ల నుంచి గం.12.55ల వరకు శ్రీపార్వతీరాజ రాజేశ్వర స్వామివారి కల్యాణమహోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. ఉత్సవాలలో భాగంగా 30వ తేదీ శనివారం సాయంత్రం గం.3.05 ని.ల నుంచి శ్రీస్వామివారి రథోత్సవము నిర్వహిస్తారు.

ఐదు రోజులపాటు ఆర్జిత సేవల నిలిపివేత

శివ కల్యాణం ఉత్సవాల సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈ నెల 27వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు పలు రకాల ఆర్జిత సేవలు నిలిపివేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. శ్రీ స్వామివారి నిత్యకల్యాణం, అభిషేకం, అన్నపూజ, లింగార్చన, సత్యనారాయణ స్వామి వ్రతము టికెట్లు సేవలను నిలిపివేస్తున్నట్లు వారు తెలిపారు. శివకల్యాణోత్సవము సందర్భంగా 28వ తేదీ శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం 3.00ల వరకు



శ్రీరాజరాజేశ్వరస్వామి వారి దేవస్థానం

కోడె టికెట్లు జారీ నిలిపివేస్తామని, నిత్య చండి సహిత రుద్రహోమం టికెట్లు ఇవ్వబడవని వెల్లడించారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానములో ఈ నెల 23వ తేదీ నుంచి మూడు రోజులపాటు డోలోత్సవం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 23వ తేదీ శనివారం సాయంత్రం ప్రదోష పూజ అనంతరం కామ దహనం నిర్వహిస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

సైదాపూర్, మార్చి 19: సైదాపూర్ మండలంలో పెర్కపల్లి గ్రామానికి చెందిన పోతరాజు ఓదయ్య(85) అనే వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓదయ్య భార్య రెండు సంవత్సరాల క్రితం మృతి చెందింది. అప్పటినుంచి ఓదయ్య మతి స్థిమితం ఉండడం లేదు. భార్య చనిపోయిందని ప్రతి రోజు భార్యను తలుచుకుంటూ ఆవేదన చెందేవాడు. మనస్థాపంతో సోమవారం ఉదయం పురుగుల మందు తాగా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు గమనించి ఓదయ్యను 108 వాహనంలో హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ ఓదయ్య అదే రోజు సాయంత్రం మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతుడి కుమారుడు యాదగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు.

ఇద్దరి అరెస్ట్

సిరిసిల్ల క్రైం,మార్చి 19: ఫేస్‌బుక్ ద్వారా పరిచయమై దావత్ చేసుకుందామని పిలిచి దాడిచేసి అందినకాడికి దోచుకున్న వేములవాడ మండలంలోని చింతల్‌ఠాణాకు చెందిన సూరదేవయ్య, సూర సురేష్‌లను మంగళవారం అరెస్ట్ చేశామని సిరిసిల్ల టౌన్ సిఐ రఘుపతి తెలిపారు. మేడ్చల్ జిల్లా మల్కాజ్‌గిరి మండలంలోని బొల్లారం గ్రామానికి చెందిన ముక్క శ్రీనివాస్‌కు చింతల్‌ఠాణకు చెందిన సూర దేవయ్యలకు ఫేస్‌బుక్ ద్వారా 15 రోజుల క్రితం పరిచయం ఏర్పడిందన్నారు. ఈ పరిచయమే దావత్ చేసుకోవాలని నిర్ణయించుకోవడంతో బొల్లారం నుంచి చింతల్‌ఠాణకు శ్రీనివాస్ వచ్చాడన్నారు. ఈనెల 17న బాబయ్ దేవయ్య, అబ్బాయ్ సురేష్‌లు ముందుగానే మద్యం సేవించి సిరిసిల్ల పాత బస్టాండ్‌లో తాను బస్సు దిగగానే బైపాస్‌రోడ్డు వద్దకు తీసుకెళ్లి తనపై దాడిచేసి రూ.3 వేలు, సెల్‌ఫోన్ లాక్కున్నారని బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదుచేసి చంద్రంపేట ఎక్స్ రోడ్డు వద్ద అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపామని ఆయన తెలిపారు.

అంజన్న టెండర్ సొమ్ముల స్వాహాపై విచారణ

మల్యాల, మార్చి 19: కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం పరిధిలో టెండర్‌దారులు చెల్లించిన సొమ్ములను ఆలయ అధికారి దేవస్థానం ఖాతాలో జమచేయకుండా స్వాహా చేయడంపై పత్రికల్లో వచ్చిన కథనాలతో దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కే.జ్యోతి మంగళవారం విచారణ జరిపారు. టెండర్ల విభాగం అధికారి శ్రీనివాసాచారి దాదాపు రూ.37లక్షల మేర సొమ్ములను దుకాణదారుల వద్ద వసూలు చేసి దేవస్థానం పద్దుకు చేర్చకపోవడంతో కొన్నాళ్ల క్రితం ఈ విషయం తీవ్ర దుమారం లేపింది. దీంతో అతన్ని దేవస్థానం అధికారులు సస్పెండ్ చేసి పోలీస్‌స్టేషన్‌లో కేసు ఫిర్యాదు చేశారు. ఇటీవల మరో రూ.11లక్షల వరకు కూడా తేలగా సదరు అధికారి గత 2020 నుంచి 2023 వరకు నిర్వహించిన టెండర్ విభాగంలో జరిగిన ఈ స్వాహా పర్వంపై దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు



పరిశీలిస్తున్న అడిషనల్ కమిషనర్ జ్యోతి

ఎట్టకేలకు విచారణ చేపట్టారు. 2022-23 సంవత్సరంలోనే అధికంగా దాదాపుగా రూ.50లక్షల మేర సొంతానికి వాడుకున్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలిసింది. అనంతరం క్యాష్‌బుక్ తదితరవి ఏడీసీ స్వాధీనం చేసుకొని తీసుకెళ్లారు. టెండర్ల లావాదేవీలకు సంబంధించిన బ్యాంక్ ఖాతా స్టేట్‌మెంట్ తీసుకు రావాలని దేవస్థానం అధికారులను ఆదేశించారు. 2018-19లో ఆడిట్ అధికారులు అనేక అభ్యంతరాలతో కూడిన నివేదిక ఇవ్వగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడంపై ఆలయ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. డీసీబీ, సీబీ, ఆడిట్ నివేదికలను కూడా ఏడీసీ తీసుకెళ్లగా విచారణ నివేదికను కమిషనర్‌కు అందించనున్నట్లు ఏడీసీ ఈ సందర్భంగా తెలిపారు. అక్రమాలకు పాల్పడినట్లు రుజువు అయితే అందరిపై చర్యలు తప్పవన్నారు. ఈ విచారణలో కరీంనగర్ ఏసీ చంద్రశేఖర్, ఈవో వెంకటేష్, ఏఈవో వై.అంజయ్య, పర్యవేక్షకులు శ్రీని వాస్‌శర్మ, సునీల్ ఉన్నారు. ఈ విచారణలో మరింత అక్రమాలు బయటకు వచ్చే అవకాశం ఉందని, అధికారులు నిర్లక్ష్యం వహించడం పట్ల వారి పాత్రపైనా విచారణ జరిపించాలని డిమాండ్ వినిపిస్తోంది.

నెమలిని వేటాడిన వ్యక్తి అరెస్టు

● ప్రధాన నిందితుడు సత్యనారాయణ ఓ డీఎస్పీ తండ్రి
● గతంలోనూ జింకల వేట కేసులో నిందితుడు

పెగడపల్లి, మార్చి 19 : జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం దోమలకుంట గ్రామ శివారులో సోమవారం రాత్రి నెమలిని వేటాడి చంపిన ఘటనలో వేటగాళ్లను జగిత్యాల జిల్లా పెగడపల్లి పోలీసులు సోమవారం రాత్రి పట్టుకుని కేసు నమోదు చేశారు. నెమలి వేటగాళ్లలో ప్రధాన నిందితుడు ములుగు జిల్లాలోని ఓ డీఎస్పీకి తండ్రి కావడం గమనార్హం. ఇతడు గతంలోనూ జింకల వేట కేసులో నిందితుడు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ మంగళవారం పెగడపల్లి పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి నిందితుల అరెస్ట్ వివరాలు వెల్లడించారు. డీఎస్పీ రఘుచందర్ తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ జిల్లా గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లికి చెందిన నలువాల సత్యనారాయణ (63), జగిత్యాల మండలం మల్యాలకు చెందిన జవ్వాజి రాజు కారు డ్రైవర్‌తో కలసి సోమవారం సాయంత్రం పెగడపల్లి మండలంలోని దోమలకుంట గ్రామ శివారులో తుపాకీతో నెమలిని వేటాడి చంపారు. దానిని కారులో తీసుకుని వెళ్తుండగా పోలీసులకు అందిన సమాచారం మేరకు పెగడపల్లి ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో వెళ్లి కారును ఆపి తనిఖీ చేశారు. కారులో నెమలి కళేబరంతో పాటు లైసెన్సు లేని తుపాకీ, గొడ్డలి ఉండటంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. నెమలిని వేటాడి తానే చంపినట్లు పోలీసుల విచారణలో నిందితుడు ఒప్పుకోవడంతో



పెగడపల్లిలో అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్

కేసు నమోదు చేశారు. నిందితుడి వద్ద నుంచి 0.22 స్పోర్టింగ్ రైఫిల్ అని రాసి ఉన్న తుపాకీతో పాటు 34 నిండు తూటాలు, ఒక కాల్చిన తూటా, గొడ్డలి, ఏపీ 15 బి 8093 నంబరు గల కారును స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు సత్యనారాయణతోపాటు డ్రైవర్ జవ్వాజి రాజుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. నిందితుడు సత్యనారాయణ 2017 లో భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ ప్రాంతంలో జింకల వేట కేసు లోనూ ప్రధాన నిందితుడని ఇతడికి వన్యప్రాణుల వేట అంటే మక్కువ అని తెలుస్తోందని డీఎస్పీ తెలిపారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

కోరుట్ల, మార్చి 19 : పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాతంకు చెందిన ఆల్లేశ్వరం శంకర్ (45) అనే వ్యక్తి అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు మంగళవారం ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. అయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన శంకర్ కర్నాటక రాష్ట్రంలోని బెంగళూర్ పట్టణంలో వడ్రంగిగా పనిచేస్తూ జీవించేవాడని అక్కడ ఉన్నపుడు అతనికి గుండె సమస్యతో ఆసుపత్రిలో చేరగా వైద్యులు శంకర్‌కు గుండె శస్త్ర చికిత్స చేసినట్లు తెలిపారు. నాలుగు సంవత్సరాల క్రితం కోరుట్లకు వచ్చిన శంకర్ పట్టణంలో వడ్రంగి పని చేస్తుండేవాడని తెలిపారు. శంకర్ అవసరాల నిమిత్తం ప్రైవేట్ బ్యాంక్‌లతో పాటు బంధువుల వద్ద అప్పుచేసినట్లు వివరించారు. అప్పులు ఎలా చెల్లించాలని భార్యతో పాటు కుటుంబ సభ్యులకు చెప్పుకుంటూ నిరంతరం బాధపడేవాడని తెలిపారు. గత వారం రోజుల క్రితం బ్యాంక్‌కు చెందిన వారు రుణం చెల్లించాలని ఫోన్ చేయగా అప్పటి నుంచి బాధపడుతూ మంగళవారం వేకువజామున ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఇంట్లో ఉరి వేసుకోని ఆత్మహత్యకు పాలుపడినట్లు ఎస్ఐ తెలిపారు. శంకర్ భార్య విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్ తెలిపారు.

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

● జగిత్యాల అడిషనల్ సెషన్ జడ్జి తీర్పు

వెల్గటూర్, మార్చి 19: మండలంలోని ముత్తునూర్ గ్రామానికి చెందిన సీపతి ప్రభాకర్, నేరెళ్ల రాజయ్య అనే ఇద్దరు వ్యక్తులకు 2009లో జరిగిన బైరం దామోదర్ హత్య కేసులో జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.5 వేలు జరిమానా విధిస్తూ జగిత్యాల అడిషనల్ సెషన్ జడ్జి సుగాలి నారాయణ మంగళవారం తీర్పునిచ్చారు. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం ముత్తునూర్‌కు చెందిన ఇద్దరు స్నేహితులు బైరం దామోదర్, సింగం రాజయ్య అదే గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన సీపతి ప్రభాకర్, సింగం రాజయ్యలకు పొలం వద్ద నీరు విషయంలో గొడవ జరిగింది. పాత కక్షలను మనసులో పెట్టుకొన్న సీపతి ప్రభాకర్, నేరెళ్ల రాజయ్య సహాయంతో 2009 డిసెంబరు 24న సింగం రాజయ్యను చంపాలని అతని పొలం వద్ద మాటు వేశారు. సింగం రాజయ్య పొలం నుంచి ఇంటికి వస్తున్న క్రమంలో అక్కడే ఉన్న సీపతి ప్రభాకర్, నేరెళ్ల రాజయ్యలు కత్తులతో హత్య చేయాలని వెంబడించగా రాజయ్య గ్రామం వైపు పరుగెత్తాడు. అదే సమయంలో పొలం పనులు ముగించుకొని వెళుతున్న సింగం రాజయ్య స్నేహితుడు బైరం దామోదర్‌ను సీపతి ప్రభాకర్, నేరెల్ల రాజయ్యలు కత్తులతో మెడ, పొట్ట భాగంలో పొడవడంతో బైరం దామోదర్ అక్కడికక్కడే మృతి చెందాడు. దామోదర్ సోదరుడు లచ్చయ్య ఫిర్యాదు మేరకు వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేసిన పోలీసులు సీపతి ప్రభాకర్, నేరెళ్ల రాజయ్యలను కోర్టులో హాజరు పరిచారు. కేసును విచారించిన అడిషనల్ సెషన్ జడ్జి సుగాలి నారాయణ ఇద్దరు నిందితులకు జీవిత ఖైదుతో పాటు, రూ.5 వేల రూపాయల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చారు. ఈ కేసులో అడిషనల్ పీపీ మల్లేశం, ఇన్వెస్టిగేషన్ అధికారులు దామెర నర్సయ్య, సీఎంఎస్ ఎస్ఐ రాజునాయక్, కానిస్టేబుల్ కిరణ్ కుమార్, కోర్టు కానిస్టేబుల్ ఎం. కిరణ్ కుమార్ నిందితులకు శిక్ష పడడంలో కోర్టుకు సాక్ష్యాధారాలు అందించడంలో ప్రముఖ పాత్ర పోషించారు. నిందితులకు శిక్ష పడడంలో కృషి చేసిన పోలీసు అధికారులను ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అభినందించారు.

సీవోఈలో ప్రవేశాలకు దరఖాస్తులకు ఆహ్వానం

తిమ్మాపూర్, మార్చి19: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్‌లో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభ కేంద్రం(సీఓఈ)లో 2024-25 విద్యా సంవత్సరానికి 9వ తరగతిలో ప్రవేశాలకు అర్హత కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ జి.దేవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. సీఓఈలో బాలురకు(80), బాలికలకు(80) సీట్లు ఉన్నట్లు తెలిపారు. ప్రవేశము పొందిన విద్యార్థులకు 9వ తరగతి సిలబస్‌తో పాటు ఐఐటి ఫౌండేషన్ కోర్సు, నీట్ ఫౌండేషన్ కోర్సులో శిక్షణ ఉచితంగా అన్ని సౌకర్య ములు కల్పించనున్నట్లు తెలిపారు.

ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యా ర్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని, ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఈ నెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మిగతా వివరాల కొరకు ఫోన్.7337349518కు సంబంధిన వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

కొండగట్టులో భక్తుల రద్దీ



ఆలయం ముందు భక్తులు

మల్యాల, మార్చి 19: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో పూజలు నిర్వహించారు. భక్తులు అంజన్నతో పాటు శ్రీరాముల వారిని బేతాళుడిని దర్శించుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. అయితే ఎండల తీవ్రత నేపథ్యంలో ఏర్పాటు చేస్తున్న చలువపందిళ్ల పనులు నత్తనడకన సాగుతుండడంతో భక్తులు అసౌకర్యానికి గురి అవుతున్నారు.

ఇంటి వద్ద తండ్రి మృతదేహం

● బాధను దిగమింగుకుని పరీక్ష రాసిన అన్నదమ్ములు

పెగడపల్లి, మార్చి 19: విధి పరీక్ష పెట్టినా ధైర్యంగా ఎదుర్కొన్నారు.. ఆ అన్నదమ్ములు. నాన్న చనిపోయాడని తెలిసి అంత్యక్రియలు నిర్వహించాల్సిన సమయం అయినా పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుకుని పదోతరగతి పరీక్ష రాశారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలోని బతికెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదే గ్రామానికి చెందిన గాజె రాము, లక్ష్మణ్ కవల పిల్లలు. వీరు పదో తరగతి చదువుతున్నారు. రాము, లక్ష్మణ్ తండ్రి చంద్రయ్య(50) ఈ నెల 15న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఆ



పరీక్ష రాసి బయటకు వస్తున్న రాము, లక్ష్మణ్

అన్నదమ్ములు బాధను దిగమింగి మంగళవారం జరిగిన పరీక్షకు హాజరయ్యారు. అనంతరం తండ్రి అంత్యక్రియలు నిర్వహించారు.

మాజీ భర్తపై భార్య యాసిడ్ దాడి

ఇబ్రహీంపట్నం, మార్చి 19: మాజీ భర్తపై ఓ మహిళ యాసిడ్ దాడి చేసిన ఘటన మండలంలోని ఎర్దండి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్దండి గ్రామానికి చెందిన నీరటి మహేష్ మెట్‌పల్లి మండలం జగ్గసాగర్ గ్రామానికి చెందిన మాస లక్షణను వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కూతురు ఉంది. కొంత కాలంగా దంపతులకు మనస్పర్థలు రావడంతో 2023లో మహేష్, లక్షణ కోర్టు నుంచి విడాకులు తీసుకున్నారు. మహేష్ మరో యువతిని పెళ్లి చేసుకుందామని నిర్ణయించుకుని ఈ నెల 20న పెళ్లికి సిద్ధం అయ్యాడు. విషయం తెలుసుకున్న మాజీ భార్య లక్షణ మహేష్‌పై కక్ష పెట్టుకుని మంగళవారం మహేష్ ఇంటికి వెళ్లి అతను ఇంటి నుంచి బయటకు రాగానే యాసిడ్‌తో దాడి చేసింది. దీంతో మహేష్‌కు వీపు, ఎడమ కన్నుపై భాగంలో స్వల్ప గాయాలయ్యాయి. మహేష్ ఫిర్యాదు మేరకు లక్షణపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు.

వేధింపులకు గురైతే సమాచారం ఇవ్వాలి



అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై ప్రమీల

ఇల్లంతకుంట, మార్చి 19: మహిళలు వేధింపులకు గురైతే పోలీసులకు సమాచారం ఇవ్వాలని షీటీం ఏఎస్సై ప్రమీల అన్నారు. మండలంలోని పొత్తూర్‌లోని శ్రీవివేకానంద పాఠశాలలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల రక్షణ కోసమే షీటీంలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. సామాజిక మాధ్యమాలతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, కరస్పాండెంట్ పండరీనాథ్, డైరెక్టర్ మధూకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు

కోనరావుపేట, మార్చి 19: పౌష్టిక ఆహారం తీసుకున్నప్పుడే పిల్లల ఎదుగుదలతోపాటు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగలక్ష్మి అన్నారు. మండలంలోని నిమ్మపల్లి గ్రామంలో పోషణ్ అభియాన్‌లో భాగంగా మంగళవారం పోషణ విలువలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పిల్లల్లో వచ్చే రక్తహీనతపై వివరించారు. మంచి ఆహారం తీసుకున్నప్పుడే పిల్లలు ఆరోగ్యవంతులుగా ఎదుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అఖిల తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పై తప్పుడు ప్రచారం

ఎల్లారెడ్డిపేట, మార్చి 19: సెస్ మాజీ డైరెక్టర్ కుంభాల మల్లారెడ్డి సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు మానుకోవాలని గతంలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేసిన మల్లారెడ్డి బండారాన్ని పూర్తి ఆధారాలతో బయట పెడుతామన్నారు. అధికారంలోకి వచ్చిన తమ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను దశల వారీగా నెరవేరుస్తోందన్నారు. హామీలు నెరవేర్చేందుకు తమ ప్రభుత్వానికి నాలుగున్నరేళ్ల సమయం ఉందన్నారు. బీఆర్‌ఎస్ వేయి అబద్ధాలను కర పత్ర రూపంలో ప్రజల ముందు ఉంచుతామన్నారు. పదేళ్లలో చేసిన మోసాలను ఎవరూ మర్చిపోలేదన్నారు. సెస్ డైరెక్టర్‌గా కొనసాగిన సమయంలో ఉద్యోగాలు ఇప్పిస్తానని పేర్కొంటూ చేసిన దందాలు, మోసాలను బయటకు తీస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, రాజయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

దేవుని భూములు కొల్లగొట్టే యత్నం

సిరిసిల్ల టౌన్, మార్చి 19 : సిరిసిల్ల పట్టణంలోని విశ్వనాథ దేవాలయానికి సంబంధించిన దేవుని భూములను సిరిసిల్ల పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, ఓ కార్పొరేషన్ మాజీ చైర్మన్ యత్నించాడని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల పట్టణం శాంతినగర్‌లో విశ్వనాథ దేవాలయానికి సబంధించిన కోట్ల రూపాయాల విలువగల భూములను కబ్జా చేయడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 11న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం సర్వే చేయగా దేవాలయానికి చెందిన మూడు గుంటల భూమి ఆక్రమణ గురైనట్లు తేలిందన్నారు. అధికారంలో ఉండగా ఆ భూమిని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు తన పలుకబడిని ఉపయోగించుకొని పట్టా చేసుకొని లేఅవుట్ చేశాడని ఆరోపించారు. కబ్జాకు యత్నించిన ఆ నాయకుడిపై కేసులు పెట్టి జైలుకు పంపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ నాయకులు సోమ నాగరాజు, మీసం లక్ష్మన్ పాల్గొన్నారు.

ఆలయ స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

రుద్రంగి, మార్చి 19: రుద్రంగి మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ స్థలాన్ని ఆక్రమించిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీ చైర్మన్ కొమురె శంకర్ అన్నారు. మంగళవారం రుద్రంగి మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయ స్థలంలో నిర్మాణం చేపడుతున్నారన్నారు. లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి 5 ఎకరాల పట్టా ఉందని, ఆలయ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపడుతున్న వారిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, ఆలయ కమిటీ వైస్ చైర్మన్ దాసరి గంగారాజం, పడాల శంకర్లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా దేవస్వామి

చందుర్తి, మార్చి 19 : చందుర్తి మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా వేల్పుల దేవస్వామిని నియమించినట్లు ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. మండలంలోని రామన్నపేట గ్రామానికి చెందిన దేవస్వామి నియామకంపై నాయకులతోపాటు పలువురు హర్షం వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ముస్తాబాద్, మార్చి 19 : ముస్తాబాద్ మండల కేంద్రంలో సోమవారం రాత్రి కురిసిన వడగళ్లవానతో స్తంభం పడి మరణించిన రైతు ఎలుసాని ఎల్లయ్య కుటుంబ సభ్యులను మాజీ ఎంపీ వినోద్‌కుమార్ మంగళవారం పరామర్శించారు. ఎంపీపీ జనగామ శరత్‌రావు, ఆర్‌బీఎస్ మండల అధ్యక్షుడు గోపాల్‌రావు, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సంతోష్‌రావు, సర్వర్‌పాషా ఉన్నారు.

● ఎలుసాని ఎల్లయ్య కుటుంబసభ్యులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, నాయకులు కనమేని చక్రధర్‌రెడ్డి, గజ్జెల రాజు, గుండెల్లి శ్రీనివాస్, ఉచ్చిడి బాల్‌రెడ్డి, అంజనేయరావుతోపాటు బీజేపీ జిల్లా కార్యదర్శి రెడ్డబోయిన గోపి, మండల అధ్యక్షుడు మెర్గు అంజాగౌడ్, చిట్నేని శ్రీనివాస్‌రావు, కరెడ్ల రమేశ్‌రెడ్డి, పెంజర్ల కళ్యాణ్ పరామార్శించారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బాధిత కుటుంబాలను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య మంగళవారం పరామర్శించారు. మంద నారాయణ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆ కుటుంబాన్ని ఓదార్చారు. ఘటన వివరాలను తెలుసుకున్నారు. అల్లం మల్లయ్య మృతి చెందగా నివాళులు అర్పించారు. నాయకులు పర్శరాములు, సందీప్, సల్మాన్ ఉన్నారు.

మంచి నీటి పథకం

పునఃప్రారంభానికి నిధులు మంజూరు

బీర్‌పూర్, మార్చి 19: మండల కేంద్రంలోని సమగ్ర రక్షిత మంచి నీటి పథకం పునఃప్రారంభం కోసం రూ.3.70కోట్లు మంజూరైనట్లు మంగళవారం బీర్‌పూర్ ఎంపీపీ మసర్తి రమేష్ తెలిపారు. నియోజకవర్గంలోని బీర్‌పూర్ మండలంలోని గ్రామాలకు గతంలో ఇంటింటికి శుద్ధమైన తాగునీరు అందించిన పథకాన్ని పునరుద్ధరించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్సీ టీ.జీవన్‌రెడ్డి సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. తాగు నీటి సమస్య పరిష్కరిస్తామని గత ఎన్నికల్లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మండల ప్రజలకు హామీ ఇచ్చారు. తమ పార్టీ అధికారంలోనికి వచ్చిందని ఇచ్చిన హామీని నెరవేర్చాలనే ఉద్దేశంతో బీర్‌పూర్ సమగ్ర రక్షిత మంచినీటి పథకం పునఃప్రారంభం కోసం నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి విన్నవించారు. స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి రక్షిత మంచి నీటి పథకం మరమ్మతుల కోసం రూ.3.70కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

వరద కాలువ నీటి విడుదలపై హర్షం

కథలాపూర్, మార్చి 19: వరద కాలువకు నీటి విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం ఎమ్మెల్యే విప్ ఆది శ్రీనివాస్, రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభి షేకం చేశారు. వరద కాలువకు నీరు రావడంతో వేలాది ఎకరాల పంటలకు రక్షణ ఏర్పడిందన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పూంద్ర నారాయణరెడ్డి, న్యావ నంది శేఖర్, నారాయణ, అనంతరెడ్డి, సత్యనారాయణ, శంకర్, గంగారెడ్డి, సాయిరెడ్డి, లింగారావు ఉన్నారు.

పంట నష్టాన్ని పరిశీలించిన అధికారులు, నాయకులు



పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు, సింగిల్ విండో పాలకవర్గం

సిరిసిల్ల రూరల్, మార్చి 19: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్, సర్దాపూర్, జగ్గారావుపల్లె, పెద్దబోనాల, చిన్నబోనాల గ్రామాల్లో సోమవారం రాత్రి కురిసిన వడగళ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలను మంగళవారం వ్యవసాయాధికారులతోపాటు నాయకులు పరిశీలించారు. పెద్దూర్‌లో వడగళ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలను వ్యవసాయ విస్తరణ అధికారి సుచరిత తోపాటు పెద్దూర్ సింగిల్ విండో చైర్మన్ జీలకిషన్‌యాదవ్, వైస్ చైర్మన్ బెజ్జారం నారాయ ణగౌడ్, డైరెక్టర్‌లు సలేంద్రి బాలరాజుయాదవ్, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ పట్టణ ప్రధాన కార్యదర్శి సలేంద్రి వేణుగోపాల్‌యాదవ్, వార్డు అధ్యక్షుడు మంగ ప్రశాంత్, ర్యాకం అనిల్‌కుమార్‌తోపాటు రైతులు అతికం నర్సయ్య, శ్రీనివాస్, వెంకటేష్ పరిశీలించారు.

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

తంగళ్లపల్లి: పంట నష్ట పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం తంగళ్లపల్లి మండలం ఒబులాపూర్‌లో నష్ట పోయిన వరిని మాజీ ఎంపీ వినోద్‌కుమార్, టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, జడ్పీ చైర్మన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నష్ట పోయిన రైతులకు పరిహారం చెల్లించాలన్నారు. తక్షణమే సర్వే నిర్వహించాలని, రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న, ప్యాక్స్ చైర్మన్ బండి దేవదాస్ ఉన్నారు.

ఎకరాకు రూ.50 వేల పరిహారం చెల్లించాలి

ఆకాల వర్షానికి దెబ్బతిన్న పంటకు ఎకారాకు రూ.50 వేలు ఇవ్వాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న డిమాండ్ చేశారు. మంగళవారం తంగళ్లపల్లి మండలం ఒబులాపూర్ తదితర గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు పర్యటించారు. దెబ్బతిన్న పంటను పరిశీలించి రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారదర్శకంగా సర్వే నిర్వహించాలని, నష్ట పోయిన రైతులందరికీ పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ పంట నష్టంపై ఫోన్‌లో కలెక్టర్‌తో మాట్లాడారని, తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారని తెలిపారు. సీపీఐ నాయకులు రాళ్లపేట తదితర గ్రామాల్లో పర్యటించారు. నష్ట పోయిన పంటను పరిశీలించి రైతులను పరామర్శించారు. దెబ్బతిన్న మామిడి తోటలను పరిశీలించారు. నష్ట పోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు బండి దేవదాస్, పడిగెల రాజు, కొడూరి భాస్కర్‌గౌడ్, ఎగుమామిడి వెంకటరమణరెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి సోమ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పెద్దూర్‌లో పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు



పరిశీలిస్తున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ అరుణ

నష్ట పోయిన ప్రతీ రైతును ఆదుకుంటాం

తంగళ్లపల్లి మండలం ఒబులాపూర్, రాళ్లపేట, వేణుగోపాల్‌పూర్, కస్బేకట్కూర్, గండిలచ్చపేట తదితర గ్రామాల్లో నష్ట పోయిన పంటలను కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. రైతులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్ మాట్లాడుతూ నష్ట పోయిన ప్రతీ రైతును ఆదుకుంటామన్నారు. అధికారుల సర్వే పూర్తవ్వగానే పరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకుడు పుర్మాణి లింగారెడ్డి తదితరులు ఉన్నారు.

రైతులకు ప్రభుత్వం అండ

ముస్తాబాద్: వడగళ్లవానతో నష్టపోయిన రైతులు అధైర్యపడొద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కనమేని చక్రధర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంతోపాటు పోతుగల్ గ్రామాల్లో నష్టపోయిన వరి, టమాట, వంకాయ వంటి కూరగాయాల పంటలను మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డితోపాటు, కనమేని చక్రధర్‌రెడ్డి పలువురు నాయకులు పరిశీలించారు. నష్టంపై అధికారులు అంచనా వేసి ప్రభుత్వం ఆదుకునేలా చూస్తామన్నారు. ఏవో వెంకటేశ్, కాంగ్రెస్ నాయకులు అన్నమనేని నర్సింగరావు, పెద్దిగారి శ్రీనివాస్, కిషన్‌రావు, అంజనేయరావు, కృష్ణ, నారాయణరావు పాల్గొన్నారు.

పోలీసు జాగిలాల సంరక్షణపై శ్రద్ధ వహించాలి



పోలీస్ జాగిలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

తంగళ్లపల్లి, మార్చి 19: జిల్లాలో సేవలందిస్తున్న పోలీసు జాగిలాల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. మంగళవారం తంగళ్లపల్లి మండలం తాడురు పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో పోలీస్ జాగీలాలను పరిశీలించారు. ఎనిమిది నెలలపాటు ఐఐటీఏ మొయినాబాద్‌లో బేసిక్ ట్రైనింగ్ పూర్తి చేసుకొని జిల్లాకు కేటాయించిన పోలీస్ జాగీలం షాడోను అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ షాడో పేలుడు పదార్థలను గుర్తించడంలో ప్రత్యేక శిక్షణ పొంది జిల్లా పోలీస్ శాఖలో సేవలందించడానికి రావడం సంతోషకరం అన్నారు. ప్రస్తు తం జిల్లాలో సేవలందిస్తున్న ఆరు జాగీలాల వివ రాలను అడిగి తెలుసుకున్నారు. జాగీలాల సంరక్షణ, వసతులలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జాగీలం షాడోకి హ్యాండ్లర్‌గా వ్యవహరిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ కిరణ్‌యాదవ్‌తోపాటు ఇతర డాగ్ స్క్వాడ్ అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐలు యాదగిరి, మధుకర్, రమేశ్ తదితరులు ఉన్నారు.

నేతన్నలకు తక్షణ సాయం అందించాలి



నేతన్న విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, మార్చి 19 : వస్త్రపరిశ్రమ సంక్షోభంతో ఉపాధి కోల్పోయిన నేతన్నలకు తక్షణ సహాయం కింద రూ.10వేలు అందించాలని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ డిమాండ్ చేశారు. నేతన్నల సమస్యలను పరిష్కారించేలా రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కల్గించాలంటూ సిరిసిల్ల పట్టణంలోని పాత బస్టాండ్‌లోని నేతన్న విగ్రహానికి మంగళవారం వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని, బతుకమ్మ చీరలతోపాటు ప్రభుత్వ ఆర్డర్‌లను అందించాలని కోరారు. వర్కర్‌టూఓనర్ పథకాన్ని పూర్తి చేసి కార్మికులకు శాశ్వత ప్రయోజనం చేకూర్చాలన్నారు. బతుకమ్మ చీరలకు సంబంధించి కార్మికులకు రావాల్సిన 2022- 2023 సంవత్సరం పది శాతం యారన్ సబ్సిడీ అందించాలన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభాన్ని నివారించి సమస్యలను పరిష్కరించాలన్నారు. మరమగ్గాల కార్మికులు బుధవారం ఉదయం 10 గంటలకు బీవైనగర్‌లోని సీఐటీయూ కార్యాలయం వద్దకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గుండు రమేష్, సబ్బని చంద్రకాంత్, మోర తిరుతతపి, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

నేత కార్మికులకు ప్రభుత్వం అండగా నిలవాలి



మాట్లాడుతున్న ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీర మోహన్

సిరిసిల్ల టౌన్, మార్చి 19 : రాష్ట్ర ప్రభుత్వం సిరిసిల్ల నేత కార్మికులకు ఉపాధి కల్పించి అండగా నిలవాలని తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీర మోహన్ అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్లలో నేత కార్మికుల పరిస్థితి దయానీయంగా మారిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో బతుకమ్మ చీరల బకాయిలు రాక మాస్టర్ వీవర్స్ కార్మికులకు ఉపాధి అవకాశాలను కల్పించలేక పోతున్నారన్నారు. కార్మికులు ఉపాధి లేక పొట్ట గడవక కుటుంబాన్ని పోషించుకునే పరిస్థితులు లేక పోవడంతో ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బతుకమ్మ చీరల ఉత్పత్తితో కార్మికులకు పెద్దగా ఒరిగిందేమీ లేదన్నారు. ప్రభుత్వం కొత్త పాలసీ తీసుకొచ్చి ప్రతీ కార్మికుడికి నెలకు రూ.20వేల వేతనాలు పడే విధంగా ఆర్డర్లు ఇవ్వాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న తడక శ్రీనివాస్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, తక్షణమే ఆ కుటుంబానికి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియాతోపాటు ఇల్లు మంజూరు చేయాలని అన్నారు. ఇద్దరు ఆడపిల్లలను గురుకుల పాఠశాలలో ప్రవేశం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తడక శ్రీనివాస్ కుటుంబానికి ఐక్యవేదిక ఆధ్వర్యంలో రూ.50వేల ఆర్థిక సహాయం అందించారు. అదే విధంగా బి.శ్రీనివాస్ 25 కిలోల బియ్యం బ్యాగ్ అందజేశారు. ఈ సమావేశంలో నాయకులు కోమటిపల్లి సదానందం, సిలివేరి గణేష్, ఆంకారపు సునీత, ఎలిగేటి శ్రీనివాస్, జడల చిరంజీవి, రావిలాల శ్రీనివాస్, కుడికాల భాస్కర్, రాపోలు వెంకటేశ్వర్లు, శ్రీగాధ మైసయ్య పాల్గొన్నారు.

కిరాణా షాపులో నాగుపాము



పామును పడుతున్న బాబు

వేములవాడ, మార్చి 19 : వేములవాడ పట్టణంలోని ఓ కిరాణం దుకాణంలో మంగళవారం భారీ నాగుపాము హల్ చల్ చేసింది. స్థానిక భీమేశ్వరాలయం వీధిలోని మల్లేశం ఇడ్లీ సెంటర్ ఎదురుగా ఉన్న శివశక్తి సాయి అనే కిరాణం దుకాణంలోకి ఆకస్మాత్తుగా పాము దూరింది. వెంటనే సదరు షాపు యజమాని బాబు అనే పాములు పట్టే వ్యక్తిని ఆశ్రయించడంతో అతను చాకచక్యంగా పట్టుకొని ఊరి బయట వదిలి పెట్టాడు. సుమారు ఆరు అడుగుల పొడవు ఉండడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

మల్లు స్వరాజ్యం వర్ధంతి



నివాళి అర్పిస్తున్న ఐద్వా నాయకురాళ్లు

సిరిసిల్ల రూరల్, మార్చి 19 : నిజాంపాలనలో దొరలు, భూస్వాములు, రజాకారులకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తూనే బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం మల్లు స్వరాజ్యం పని చేశారని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సూరం పద్మ అన్నారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం మల్లు స్వరాజ్యం ద్వితీయ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ మల్లు స్వరాజ్యం చిన్ననాటి నుంచే వెట్టి చాకరీ, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జివ్వాజి విమల తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. దెబ్బతిన్న వరిపంట

తంగళ్లపల్లి, మార్చి 19: వడగండ్ల వానతో వేల ఎకారాలలో వరిపంట దెబ్బతింది. సోమవారం రాత్రి తంగళ్లపల్లి మండలంలో కురిసిని వడగళ్ల వానకు వరి, మామిడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఒబులాపూర్, మండెపల్లి, రాళ్లపేట, వేణుగోపాల్‌పూర్, కస్బెకట్కూర్, తంగళ్లపల్లి, అంకిరెడ్డిపల్లె, గండిలచ్చపేటలో కోతకు వచ్చిన వరి పూర్తిగా దెబ్బతింది. మామిడి కాయలు నెలరాలి తీవ్ర నష్టం వాటిల్లింది. వ్యవసాయ అధికారి సందీప్ తన సిబ్బందితో నష్ట పోయిన పంటలను పరిశీలించారు. ప్రాథమిక సర్వే ప్రకారం సుమారు 280 ఎకరాల్లో వరిపంట నష్టం జరిగినట్లు అంచనా వేశారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

ఎల్లారెడ్డిపేట, మార్చి 19 : రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్, హరిదాస్‌నగర్ గ్రామాల్లోని రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రెడ్డి కులస్థుల సంక్షేమం కోసం సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, అనంతరెడ్డి ,మల్లారెడ్డి, రాజిరెడ్డి పాల్గొన్నారు

అరుణోదయ నిషేధిత సంస్థ కాదు

సిరిసిల్ల క్రైం, మార్చి 19: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్యను నిషేధిత సంస్థగా అభివర్ణించడాన్ని రాష్ట్ర ఏసీఎఫ్ గౌరవాధ్యక్షురాలు విమలక్క, అధ్యక్షుడు మోహన్ బైరాగి, ప్రధాన కార్యదర్శి మల్సూర్ మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. 1974లో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్యగా ఏర్పడి 50 సంవత్సరాలుగా ప్రజల కోసం గళం విప్పి పని చేస్తోందని పేర్కొన్నారు. ఇలాంటి సంస్థను నిషేధిత సంస్థగా ఎస్పీ అభివర్ణించడం సరికాదని తెలిపారు. జిల్లాలోని లా విద్యార్థి పోకల సాయికుమార్‌తోపాటు పురుషోత్తమరావు అనే అమాయకులపై సెప్టెంబరు 2023లో తప్పుడు కేసులు నమోదు చేసి అరెస్ట్ చేసిన సందర్భంగా అరుణోదయ సంస్థపై తప్పుడు వ్యాఖ్యలు చేయడాన్ని నిరసించాలని విజ్ఞప్తిచేశారు. అరుణోదయ ప్రజా సంఘాల కార్యకర్తలపై అక్రమ కేసులు ఎత్తివేయాలని, నిషేధిత సంస్థగా వర్ణించిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

బహుజన వాదానికి పుట్టినిల్లు బీఎస్పీ

సిరిసిల్ల టౌన్, మార్చి 19 : బహుజన వాదానికి బీఎస్పీ పుట్టినిల్లని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంకని భాను అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం బీఎస్పీ కార్యాలయంలో జిల్లా ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడారు. బీఎస్పీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఆర్‌ఎస్‌లో చేరినా బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జిల్లా నాయకత్వం బీఎస్పీతోనే ఉంటుందన్నారు. బీఎస్పీలోకి వస్తుంటారు.. పోతుంటారని, కార్యకర్తలు నిరుత్సాహ పడవద్దని అన్నారు. రానున్న రోజుల్లో గ్రామాల్లో బీఎస్పీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థిని గెలిపించుకునే విధంగా పని చేయాలన్నారు. ఈ సమావేశంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు వర్ధవెల్లి స్వామిగౌడ్, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి ఎనగందుల వెంకన్న, జిల్లా ఇన్‌చార్జిలు చాకలి రమేష్, పిట్టల భూమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు మహేందర్, జిల్లా ప్రచార కార్యదర్శి యారపు రాజబాబు, జిల్లా కోశాధికారి అబ్దుల్ నబీ, జిల్లా కార్యదర్శులు తాటిపెల్లి అంజన్న, అరుకాల రమేష్, సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి చెక్కపల్లి శ్రీనివాస్, అధ్యక్షుడు లింగంపల్లి మధూకర్, కార్యదర్శి కొమురయ్య, వేములవాడ ఇన్‌చార్జి అరుణ్, బీఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ నరేష్, నాయకులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

జగిత్యాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఓ యువకుడికి రెండు రోజుల జైలు శిక్ష విధించా రు. గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లె గ్రామానికి చెందిన ఎం. అజయ్(23) గొల్లపల్లికి వెళ్తుండగా జగిత్యాల ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు చేశారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పరిమితికి మించి మందు తాగినట్లు తేలింది. అంతే కాకుండా సదరు వ్యక్తి పోలీస్ సిబ్బందిపై అనుచితంగా ప్రవర్తించడంతో యువకుడిని కోర్టులో ప్రవేశపెట్టారు. స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ సెకండ్ క్లాస్ జి.కరుణాకర్ అజయ్‌కి రెండు రోజుల పోలీస్ కస్టడీకి ఆదేశాలు జారీ చేశారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



రాలిన వరిని చూపిస్తున్న వినోద్‌కుమార్

సిరిసిల్ల టౌన్, మార్చి 19: వడగళ్ల వర్షాలతో నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం బీఆర్‌ఎస్ కార్యాయలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అకాల వర్షంతో విద్యుత్ స్తంభం విరిగిపడి ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన ఎల్సాని ఎల్లయ్య మృతి చెందడం బాధాకరమన్నారు. ఎల్లయ్య కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రైతు బీమా పథకం ద్వారా ఎల్లయ్య కుటుంబానికి రూ.5లక్షల ఆర్థిక సహాయాన్ని అందించాలని కలెక్టర్‌ను కోరారు. రైతులు ఆరుగాలం శ్రమించి వేలాది రూపాయాలు ఖర్చు పెట్టి పంటలు సాగు చేసుకున్నారని, వడగళ్ల వర్షంతో రెక్కల కష్టం నేలపాలవ్వడంతో రైతులు కన్నీరు పెడుతున్నారని అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంతోపాటు పోత్గల్, సేవాలాల్ తండా, గన్నేవానిపల్లి, తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్ గ్రామాల్లో పర్యటించినట్లు చెప్పారు. వడగళ్ల వర్షంతో వరి పంట పూర్తిగ దెబ్బతిన్నదన్నారు. వ్యవసాయ అధికారులతో సర్వే చేయించాలని, పంట నష్టం అంచనా వేయాలని కోరారు. నష్టపరిహారం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. వడగళ్ల వర్షం కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ. 10వేలు అందించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో రైతు రాజ్యం పోయిందని, పదేళ్ల క్రితం ఉన్న రాజ్యం మళ్లీ వచ్చిందని రైతులు బాధపడుతున్నారన్నారు. గన్నేవానిపల్లి రైతులు పొలాలకు కాల్వలో మోటార్లు వేసుకొని నీళ్లపారించుకుంటే పోలీసులు కేసులు పెట్టడం సరికాదన్నారు. పది సంవత్సరాల కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏ ఒక్క రైతుపైనా కేసు పెట్టలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పందించాలని, రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరారు. యాసంగి సీజన్‌లో సాగు చేసిన వరి పంట పొట్ట దశలో ఉందని, ఆలస్యంగా వేసిన మరికొన్ని పొలాలు ఏప్రిల్ వరకు ఉంటాయని అన్నారు. ప్రభుత్వం కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని, పంటలు ఎండకుండా చూడాలని అన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో వినోద్ కుమార్ ఫోన్‌లో మాట్లాడారు. వడగళ్ల వానలతో వరి పంట నష్టం, విద్యుత్ స్తంభం విరిగి మీద పడి మృతి చెందిన ఎల్లయ్య కుటుంబానికి ఆర్థిక సాయం చేయాలని కోరారు. ఇప్పటికే తన దృష్టికి వచ్చిందని వివరాలను పరిశీలించి రైతులను ఆదుకుంటామని, మృతుడి కుటుంబానికి సహాయం అందిస్తామని మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణారాఘవరెడ్డి, టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, పీఏసీఎస్ చైర్మన్ రామ్మోహన్, నాయకులు బండ నర్సయ్య, బొల్లి రామ్మోహన్, తిరుపతి, మల్లారెడ్డి, యాదగిరి, నాగరాజు, శ్రీనాథ్, శ్రీనివాస్, పెంటయ్య, సత్యనాయక్, సంపత్ పాల్గొన్నారు.